క్లుప్తంగా

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నేత వేణురెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ రెడ్డి, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శులు గిరీష్‌కుమార్, తిప్పేరుద్రయ్య, సూర్యమోహన్, కౌన్సిలర్ షాజియా తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌కు సన్మానం

లేపాక్షి: కంచిసముద్రం సెక్టార్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కడప జిల్లా జమ్ములమడుగు సీడీపీఓగా పదోన్నతి పొందిన జయమ్మను శనివారం పులమతి గ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామ పెద్దలు ఆమె సేవలను కొనియాడారు. అనంతరం ఆమెకు పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

పీఈటీ లేకున్నా ఖోఖో పోటీల్లో విజయం



విజేతలతో ఉపాధ్యాయులు

పావగడ: తాలూకాలోని సాసలకుంటె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకున్నా ఆ పాఠశాల విద్యార్థులు ఖోఖో క్రీడా పోటీల్లో విజయం సాధించి ప్రశంసలు పొందారు. కొరటగెరెలో శనివారం నిర్వహించిన మధుగిరి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో వరుసగా రెండోసారి గెలుపొందారు. కొన్నేళ్లుగా ఆ పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయుడి ని నియమించలేదు. అయినా ఆ పాఠశాల విద్యార్థులు గ్రామంలోని యువకుల సహకారంతో ఖోఖో ఆటలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, భారత మాత సేవా ట్రస్ట్ అధ్యక్షుడు నాగేంద్ర ప్రతాప్ తదితర ఖోఖో శిక్షకులు ఆదర్శ్, ధనుష్, ప్రవీణ్, విజి, భీమజ్జ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

రొళ్ల: ఆర్.రంగాపురం గ్రామంలో శనివారం వైభవంగా జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని గ్రామస్తులు ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. గ్రామానికి చెందిన మహిళల శనివారం ఉదయం బియ్యం పిండితో చేసిన జ్యోతులతో ఊరేగింపులో ఉత్సవ విగ్రహం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



మాట్లాడుతున్న బలరాంరెడ్డి

హిందూపురం: బాల యేసు డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జియావుల్లా ఖాన్ అధ్యక్షతన జరిగినకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, బాలయేసు విద్యాసంస్థల ఏఓ శౌరిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా బలరాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కంటి వైద్యశిబిరం

హిందూపురం: స్థానిక ఎంజీఎం ఉన్నతపాఠశాల ఆవరణలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం, ట్రినిటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 625 మందికి పరీక్షలు చేసి 189 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఎంపికైన రోగులందరినీ బెంగళూరు శంకర కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే గత నెలలో ఆపరేషన్ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. రోగులకు జిఆర్‌లాడ్జి రమేష్, కల్లూరు ప్రభు భోజన వసతి ఏర్పాటు చేశారు.

వెరికోస్ వెయిన్స్ వైద్య శిబిరం

హిందూపురం: రోటరీక్లబ్, ఏవీస్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఉచిత వెరికోస్ వెయిన్స్ వెరికోస్ వెయిన్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్ సభ్యులు నారాయణ, ఆదినారాయణ, ఓబుల్ కొండయ్య, డా. ఆదినారాయణ, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

ఊరు ఊగుతోంది..



- గ్రామాల్లో ఏరులైన పారుతున్న మద్యం
- చితికిపోతున్న సామాన్యులు
- నియోజకవర్గంలో దాదాపు 315 బెల్టు షాపులు
- బెల్టు షాపులు అరికట్టడంలో విఫలమైన ఎక్సైజ్ అధికారులు

మడకశిర నియోజకవర్గంలోని ప్రభుత్వ మద్యం షాపులు, బెల్టు షాపుల వివరాలు..

మండలం	ప్రభుత్వ మద్యం షాపులు	బెల్టుషాపులు
మడకశిర	02	83
రొళ్ల	01	67
అగళి	01	53
గుడిబండ	02	49
అమరాపురం	02	63

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో ఊరారా బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం దొరుకుతుండంతో మందుబాబులకు కిక్కు దిగడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యంత పూర్తిగా వెనుకబడిన ప్రాంతం మడకశిర నియోజకవర్గం. ఈ ప్రాంతం పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు, మార్కెట్లు ఇతర ఉపాధి అవకాశాలు లేవు. దీంతో చాలామంది బెంగళూరు, మైసూరు, తుమకూరు, హిందూపురం తదితర ప్రాంతాలకు వలస పోయి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి. ఈక్రమంలో గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తుండంతో చాలామంది మద్యానికి అలవాటు పడటంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

కూలి సొమ్మంతా మద్యానికే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం విధానం తీసుకొచ్చింది. తద్వారా నియోజకవర్గంలో మద్యం షాపులను పెంచింది. దీనికితోడు ఊరూరా బెల్టు షాపుల వెలిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 360 గ్రామాలుండా సుమారు 315 బెల్టు షాపులున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే సీఎం చంద్రబాబు మద్యం షాపుల యజమానులు బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని లైసెన్సులు కూడా రద్దు చేసి రూ.10 లక్షలు జరిమానా కూడా విధిస్తామని ప్రకటించారు. అయితే ఆచరణలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఊరూరా బెల్టు షాపులున్నా ఎక్సైజ్ పోలీసులు వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు.



గుడిబండ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

బెల్టుషాపులు తొలగించాలి



గతంలో మాజీ సీఎం జగన్ ఆదాయం కన్నా ప్రజల సంక్షేమం ముఖ్యమని సామాన్యులకు అందకుండా మద్యం రేట్లు భారీగా పెంచారు. అప్పుడు మహిళలు ఎంతో ఆనంద పడ్డారు. కూటమి ప్రభుత్వం బెల్టు షాపుల ద్వారా మద్యాన్ని గ్రామాల్లో ఏరులైపారిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల్లో బెల్టు షాపులు తొలగించాలి.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



రాష్ట్రంలో మహిళల పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. ప్రతి గ్రామంలో బెల్టుషాపుల ద్వారా మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. పురుషులు కూలి సొమ్మంతా మద్యానికే తగలేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి మహిళలు కుటుంబాలను పోషించుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారు.

– వరలక్ష్మి, రొళ్ల

అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తే చర్యలు

గ్రామాల్లో అక్రమంగా మద్యం తీసుకొచ్చి బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకొంటాం. బెల్టు షాపుల ద్వారా అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకుచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఈ విషయాన్ని బెల్టు షాపుల నిర్వాహకులు గమనించాలి.

– వీరాంజనేయులు, ఎస్‌ఐ, రొళ్ల మండలం

పార్టీ బలోపేతానికి కమిటీలే కీలకం



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలే కీలకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం మండలంలోని తాడంగిపల్లి గ్రామ పంచాయతీ గ్రామ కమిటీలను ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎన్నికైన కమిటీల సభ్యులను అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీల్లో ఉన్న ప్రతి సభ్యుడు కష్టపడి పని చేయాలన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తాడంగిపల్లి కమిటీలో పంచాయతీ అధ్యక్షుడిగా శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్, బీసీ సెల్ అరవింద్, ఎస్సీ సెల్ రామాంజి, మహిళా సెల్ సుష్మిత, రైతు అధ్యక్షుడిగా ఆదిమూర్తి, సోషల్ మీడియా శ్రీధర్‌రెడ్డి, మైనార్టీ సెల్ మొహమ్మద్ షఫీ, పోలింగ్ బూత్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థి సెల్ బాలాజీరెడ్డి, వలంటీర్ విభాగం గాయత్రి, ఎస్టీ సెల్ రామాంజినాయక్, జనరల్ సెక్రటరీ బి.రవి, బూత్ కమిటీ చంద్రశేఖర్ తదితరులు ఎంపికయ్యారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



నర్సేగౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు మాజీ మంత్రి నర్సేగౌడ్,మాజీ ఎమ్మెల్యే వైటీప్రభాకర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఈసీ సభ్యులుగా నూతనంగా నియమితులైన మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు మడకశిరలో శనివారం వేర్వేరుగా సన్మానించారు. రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, మెళవాయి సర్పంచు రంగనాథ్, స్థానిక నాయకులు శ్రీనివాస్,మాళేగౌడ్,రవి, నగేష్,హరీష్,నరేష్ తదతరులు వారిని సన్మానించారు. ఈసందర్భంగా సీఈసీ సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారు నాయకులకు సూచించారు.

ఆదర్శప్రాయుడు మహర్షి వాల్మీకి



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి



శెట్టిపల్లిలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులు

లేపాక్షి: మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం కంచిసముద్రం గ్రామంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్, నాయకులు ఆనంద్, లోకేష్, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, శ్రీరామిరెడ్డి, చలపతి, బషీర్, గోపాలప్ప, వెంకటేష్, వెంకటరెడ్డి, బాలక్రిష్ణ, శ్యాంప్రసాద్‌రెడ్డి, తిప్పన్న, మాధవరెడ్డి, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వాల్మీకి అడుగుజాడల్లో నడవాలి

పెనుకొండ: ప్రతి ఒక్కరూ వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని వాల్మీకి సంఘం నాయకులు పేర్కొన్నారు. శెట్టిపల్లి గ్రామంలో శనివారం వాల్మీకి జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకులు గ్రామ కూడలిలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడిగా నాగేంద్ర వాల్మీకి సంఘం మండలాఅధ్యక్షుడిగా శెట్టిపల్లి గ్రామానికి చెందిన జక్కప్ప గారి నాగేంద్రను నియమించినట్లు వాల్మీకి సంఘం జిల్లా నాయకులు శనివారం తెలిపారు. గ్రామంలో జరిగిన ఎంపిక కార్యక్రమానికి ఏపీ వాల్మీకి బోయ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎనుముల పల్లికి చెందిన చెడిపోతుల కేశవ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరేష్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు బోయ మాధవయ్య, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు తలారి రమేష్, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు సాకే మంజునాథ్, ధర్మవరం టౌన్ అధ్యక్షులు బాచి హాజరయ్యారు. వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ కోసం కృషి చేస్తానని నాగేంద్ర తెలిపారు.

మడకశిర: నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా వచ్చి వాల్మీకి విగ్రహానికి హారతులు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, వాల్మీకి సంఘం అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులు వైద్య విద్య చదవకూడదా బాబూ..?

- నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక



మాట్లాడుతున్న సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: పేద విద్యార్థులు వైద్య విద్య చదవకూడదా చంద్రబాబూ..? అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ప్రశ్నించారు. శనివారం హిందూపురంలోని సడ్లపల్లిలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల పట్ల కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా ఉందనడానికి వైద్య కళాశాలలను పీపీపీ విధానంలోకి మళ్లించడమే నిదర్శనమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ తన హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలు ప్రారంభించి అందులో ఆరింటిని పూర్తి చేశారని, మిగిలిన కళాశాలలను 60 శాతం పూర్తి చేశారని గుర్తు చేశారు. ప్రజలను పక్క దోవ పట్టించడానికి సీఎం చంద్రబాబు ఏదో ఒక కుట్ర చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. మంచి చేసిన వైఎస్ జగన్‌పై ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతారని, చంద్రబాబు కూడా మోసాల బాబుగా గుర్తుండిపోతారన్నారు. వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా ప్రతి ఒక్కరూ తమ సంతకాల ద్వారా వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు. వార్డు ఇన్‌చార్జులు శబరీష్‌రెడ్డి, కురుబ శ్రీనాథ్, మీడియా కోఆర్డినేటర్ ప్రణయ్‌రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, మహిళా విభాగం అధ్యక్షురాలు కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13 వార్డు కమిటీ ఏర్పాటు:

సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో 13 వ వార్డు సడ్లపల్లిలో వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. వార్డు అధ్యక్షుడిగా సగర మారుతి, ఉపాధ్యక్షుడిగా కె. మారుతి, నీలప్పను నియమించారు.

సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జేడీఎస్ అనంతరాజు తదితరులు

అగళి: సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని మజీ మంత్రి హెచ్ బీ నర్సెగౌడ్ల, జేడీఎస్ అనంతరాజు అన్నారు. మధూడి జెడ్పీహైస్కూల్‌లో హెచ్ ఎం దాసేగౌడ్, ఉపాధ్యాయుడు తిమప్ప ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, ఎంఈఓ కృష్ణరాజు, చంద్రశేఖర్, గోపాల, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు మహేంద్రప్ప, కో ఆప్షన్ మెంబర్ నాసిర్, ఎంపీటీసీలు నిర్మలమ్మ, మంజుళ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు వరప్రసాద్, తిప్పేస్వామిని శనవారం ఎంఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం లత, ఉపాధ్యాయులు తిప్పేస్వామి, ఆనంద్‌కుమార్, ఆంజనేయులు, శ్రీకాంత్, ఉషారాణి, నీరజనవనీతం, బాషా, చైత్ర, గోవిందరాజులు, ఉమేష్ పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: ఇటీవల ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన, పదోన్నతి పొందిన మున్సిపల్ ఉపాధ్యాయులను స్థానిక ఎంజీఎం పాఠశాల ప్రాంగణంలో శనివారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, పెనుకొండ ఉప విద్యాశాఖ అధికారి జాన్ రెడ్డప్ప, ఎంఈఓ గంగప్ప హాజరై మాట్లాడారు.

ఉత్సాహంగా యువ దినోత్సవం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టింబక్టు-కలెక్టివ్(చిగురు) ఆధ్వర్యంలో శనివారం యువ దినోత్సవం ఉత్సాహంగా సాగింది. ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, మ్యూజికల్ చైర్, ఉట్టికొట్టడం తదితర ఆటల పోటీలు నిర్వహించారు. జానపద గీతాలు, చక్కల భజన అలరించాయి. ప్రతిభ కనపచిన వారికి బహుమతులు అందజేశారు. పెనుకొండ, రొద్దం మండలాల నుంచి 250 మంది యువతీ, యుకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్గానిక్ మేనేజర్ మహేష్, చిగురు మేనేజర్, విభ కోర్డినేటర్ వై రామన్న, టింబక్టు కలెక్టివ్ ఈడీ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలి

అమరాపురం: బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కేజీబీవీ, డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో శనివారం ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం పోషణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

అగళి: బాలికలు ఉన్నత చదువులు చదవి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి అన్నారు.స్థానిక కస్తూర్బా పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాలికలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ నాగరత్న, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టార్టర్ల చోరీ

గోరంట్ల: బూదిలి గ్రామానికి చెందిన రైతు విష్ణువర్ధనరెడ్డి పొలంలో విద్యుత్ మోటార్లకు ఏర్పాటు చేసిన రెండు స్టార్టర్లను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఘటనలో రూ.13 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

'కోటి సంతకాల సేకరణ'ను జయప్రదం చేయండి



మడకశిర: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం అయితే పేదలు డబ్బు చెల్లించి వైద్య సేవలు పొందాల్సి ఉంటుందని తెలిపారు. వైద్య విద్య పేద విద్యార్థులకు అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యావంతులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం కాకుండా కాపాడాలని కోరారు. కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు పంపుతామని, ప్రజాభిప్రాయానికి కూటమి ప్రభుత్వం దిగిరాక తప్పదని పేర్కొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

పావగడ: తాలూకా లోని వైఎన్ హొసకోట గ్రామం చౌడేశ్వరి సముదాయ భవనంలో స్థానిక శ్రీ క్షేత్ర ధర్మ స్థల గ్రామాభివృద్ధి యోజన ఆధ్వర్యంలో వాల్మీకి సంజయ కుమార స్వామి నేతృత్వంలో శనివారం దివ్యాంగులకు వివిధ పరికరాలు అందించారు. ఈ సందర్భంగా తాలూకా యోజనాధికారి హెచ్ మహేశ్ 520 మంది దివ్యాంగులకు వివిధ పరికరాలు, వృద్ధులకు అందించారు. అలాగే పాఠశాలలకు డెస్కులు, బెంచులు, వాటర్ ఫిల్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ నాగరాజు, ఎస్ఆర్ అశ్వర్థ్ కుమార్, సోమణ్ణ తదితరులు హాజరయ్యారు.

భైరప్ప మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న కట్టా నరసింహమూర్తి

పావగడ: ప్రముఖ సాహిత్య వేత్త ఎస్ఎల్ భైరప్ప మృతి సాహిత్య లోకానికి తీరని లోటని స్థానిక కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని గురుభవన్ లో శనివారం నిర్వహించిన ఎస్ఎల్ భైరప్ప శ్రద్ధాంజలి సభలో ఆయన మాట్లాడారు. కాగా 90 వసంతాలు దాటిన భైరప్ప ఇటీవల అనారోగ్యంతో కన్ను మూశారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన శ్రద్ధాంజలి సభలో కట్టా నరసింహమూర్తి మాట్లాడుతూ నిర్భయంగా సాహిత్య కృతులు రాసే భైరప్ప తన కావ్యాలలోని పాత్రలు సజీవంగా కళ్లెదుటే కదలాడు తున్నట్లు సాక్షాత్కారించే వని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ బసవ లింగప్ప, కసాప డైరెక్టర్ ఎంఎస్ విశ్వనాథ్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా భైరప్ప చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు.

రోడ్డు మరమ్మతు



రోడ్డుకు మట్టిని తోలించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి సచివాలయం-3 వెళ్లే ప్రధాన రోడ్డును మరమ్మతు చేశారు. రోడ్డు సమస్యపై ఇటీవల సాక్షిలో' చినుకు పడితే చిత్తడే' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈఓఆర్డీ గోవిందప్ప శనివారం బురద రోడ్డుపై గ్రావెల్ తోలించి చదును చేయించారు. రోడ్డు మరమ్మతు కావడంతో స్థానికులు ఈఓఆర్డీ, సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యం షాపుల తనిఖీ

సోమందేపల్లి : మండలంలోని మద్యం షాపులను శనివారం ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైన కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక స్క్వాడ్ బృందంతో దుకాణాల్లో మద్యాన్ని పరిశీలించి శాంపిల్స్ సేకరించినట్లు సీఐ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

అగళి: దోమల ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శివానంద, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ షమీవుల్లా సూచించారు. శనివారం మండల కేంద్రంలో మలేరియా నివారణపై విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. బీసీ హస్టల్ వార్డెన్ సికిందర్ బాషా, ఆరోగ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.